స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అవగాహన

విశాలాంధ్ర - సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్య క్రమంలో భాగంగా మంగళవారం గ్రంథాలయం అధికారిణి వి.శిరీష ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అంశంపై విద్యార్థులచే డ్రాయింగ్ వేయించారు. అలాగే పరిసరాలు పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుభ్రత మీద ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలనేదే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి రత్న కుమార్, పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

దివిస్, అరబిందో ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా మత్స్యకార ప్రజా ఆందోళన

- జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు

విశాలాంధ్ర - పాయకరావుపేట: కాకినాడ జిల్లాలో సముద్ర తీరం వెంట ఏర్పాటు చేసి ఉన్న దివిస్, అరబిందో ఫార్మా కంపెనీల వల్ల మత్స్యకారులకు జరుగుతున్న నష్టంపై జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకార ప్రజా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు ఆందోళన జరిపే ప్రాంతాలలో కరపత్రాలు, ఆటోల ద్వారా ప్రచారం చేసేందుకు పోలీసుల అనుమతులు కోరారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సముద్ర తీరం వెంట ఏర్పాటు చేసిన పరిశ్రమల వల్ల, పరిశ్రమలు సముద్రంలో విడుదల చేస్తున్న విష వ్యర్థాల వల్ల సముద్రంలో మత్స్య సంపద నాశనమై, మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోతుందని తెలిపారు. దీనిపై మత్స్యకారులంతా పోరాటాలు చేస్తూనే ఉన్నామని తెలిపారు. కాకినాడ జిల్లాలో దివిస్, అరబిందో ఫార్మా కంపెనీల వల్ల మత్స్యకారులకు జరుగుతున్న నష్టం పై పలు పర్యాయాలు గ్రామస్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని మత్స్యకార ప్రజా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా మత్స్యకారులు విజయవంతం చేయాలని మోసా అప్పలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు సిహెచ్. స్వామి, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్, బి.జ్యోతి రాజు, కార్యదర్శి ఎస్. ఆనంద్, ఆనందరావు, సిహెచ్. సమర్పణ, ఎస్.రాజు, బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌ను కలిసిన పల్లా రమణ

విశాలాంధ్ర - సబ్బవరం: విశాఖ ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్‌గా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కోన తాతారావును జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమవారం జనసేన నాయకులు పల్లా రమణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువా కప్పి పూలగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన నాయకులు సబ్బవరపు రమణ, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారంలో దుర్గమ్మ బోనాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలోని దుర్గాదేవి బోనాలు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా భజన కార్యక్రమాలు సప్తాహం ముగింపు జరిపించారు. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం అమ్మవారి బోనాలు సందర్భంగా గ్రామంలోని మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు ఊరేగించి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కలిగట్ల మాణిక్యం, వెదుర్ల బంగారి, సియ్యాదుల అచ్యుత్ కుమార్, సుంకర శ్రీను, బండి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చోడిపల్లి అప్పారావుకు సేవా పురస్కారం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంక బ్రతభాగ్చి చేతులమీదుగా మత్స్యకార నాయకులు, పూడిమడక వివేకానంద స్వచంద సేవా ఆర్గనైజేషన్ అధ్యక్షులు చోడిపల్లి అప్పారావునును శాలువాతో సన్మానించి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అప్పారావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని గత 25 సంవత్సరాలగా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ , యువతను చైతన్యపరిచి రక్తదాన శిబిరాలు, స్వచ్ఛంద సేవా కార్యమాలును నిర్వహిస్తూ 45 సార్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు అవగాహన

జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు

విశాలాంధ్ర - కశింకోట: మండలం కశింకోటలో పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్రావు మంగళవారం అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పాలల్లో మెళకువల గురించి వివరించారు. హెరిటేజ్ డెయిరీలో పాలు పోసిన అందరికీ రైతుకి పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ 50 రూపాయలకు అదే విధంగా ఆడపెయ్య పుట్టుటకు 500 రూపాయలకే కృత్రిమ గర్భధారణ రైతులకు అందించబడు తుందన్నారు. అంతేకాకుండా డెయిరీ పాడి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న ప్రతి గ్రామంలో పశువులకు కృత్రిమ గర్భధారణ అందరికీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. హెరిటేజ్ డైరీ రీజనల్ మేనేజర్ పి.తులసి నాయుడు రైతులతో మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ జిల్లాలో అన్ని డెయిరీలు కంటే ఎక్కువ రేటు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేష, మేనేజర్ ఆర్వై నాయుడు, రైతులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మాడుగుల మోదకొండమ్మ జాతర

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ పండుగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం కోసం బారులు తీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మోదమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి ఘటాలు సమర్పించేందుకు వేలాది మంది భక్తులు శిరస్సున ఘటాలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండుటెండలను దష్టిలో ఉంచుకొని ఆలయానికి వచ్చే భక్తులకు వడదెబ్బ తగలకుండా ఆలయం ముందు భాగంలో టెంట్లు, భక్తులకు అవసరవయ్యే అనేక ఏర్పాట్లు చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో కూలింగ్ మినరల్ వాటర్‌ను అందుబాటులో ఉంచారు. ఈ జాతరలో మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తితో కలిసి అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పివిఎస్.మాధవ్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తదితరులు మోదకొండమ్మను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

జాతరలో విషాదం :

మాడుగుల మోదకొండమ్మ జాతరలో విషాదం నెలకొంది. విశాఖ నుండి జాతరకు వచ్చిన నలుగురు యువకులు పాలగెడ్డ జలాశయం వద్ద కాలకృత్యాలు నిమిత్తం వచ్చారు. వచ్చిన యువకుల్లో కే.రోషన్ అనే యువకుడు చెరువులో దిగి కొట్టుకుపోయాడు. అతని స్నేహితులు జయశంకర్, డి.గణేష్; ఎస్.నవీన్ కొట్టుకుపోయిన యువకుడ్ని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక గ్రామానికి చెందిన ఆడారి వెంకట సత్యనారాయణ, సరోజిని దంపతుల కుమారులు శ్రీకాంత్, హరీష్ గురువారం రూ.50,000 విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, దాడి మునిలినాయుడు, వెలగా శ్రీనివాసరావు, కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ రామునాయుడు, పెంటకోట ఉమేష్, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించి సాగు ఉపయోగాలను వివరించాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. మండలంలోని ఉగ్గిన వలస గ్రామంలో మంగళవారం నూరు శాతం రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఉగ్గిన వలస గ్రామం చేపడుతున్న ట్లే మరికొన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. నవధాన్యాలు వేస్తున్న పంటలను కూడా ఈ పంట ద్వారా నమోదు చేయాలన్నారు.

వారాడ గ్రామంలో నవధాన్యాలు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ మాతృనాయుడు, సిబ్బంది మరిడి నాయుడు, వ్యవసాయ సిబ్బంది పూజిత, కళ్యాణి, స్నేహ, సేవిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడువాడలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - కె.కోటపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా బుధవారం చౌడువాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. గుండుపాలెం ఫీడర్‌కు సంబంధించి చౌడువాడ మల్లం పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సీఐని కలిసిన జనసేన నేతలు

విశాలాంధ్ర - సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం సీఐగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన జి.రామచంద్రరావును పోలీస్ స్టేషన్లో మంగళవారం జనసేన సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో మండల జనసేన పార్టీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గండి దుర్గాప్రసాద్, కర్రీ కనకరాజు, బైలిపూడి దేముడు, సింగంపల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి రామకృష్ణ, గొర్లి కుమార్, పల్లా రమణ, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, పల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చనందుకు నిరసనగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంక సూర్యనారాయణ, ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి సత్య మహేష్, ఇసరపు తాతారావు, కొనే పుత్రయ్య, చేపల తాతాజీ, పిరాధి రాజు, జొన్నకూటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా మంగళవారం బుక్ రీడింగ్ స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు నరసింహమూర్తి పాల్గొని మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాల వలన ఎంతో ఉపయోగం ఉంటుందని ఇటువంటి కార్యక్రమాల వలన గ్రంథాలయానికి రావడం ఒక మంచి అలవాటు అలవడుతుందని అన్నారు. అనంతరం తెనాలి రామకృష్ణ కథలు చదివి వినిపించారు. అదేవిధంగా విద్యార్థులు చే నీతి కథలు చదివించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జె.వి.పాలెంలో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని జంగులూరు వెలంపాలెం గ్రామంలోని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఏ .విభూషణరావు అందించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వజ్రపు శ్రీనివాసరావు(34) అనే వ్యక్తి విజయవాడలో ఒక ప్రైవేట్ హాస్టల్లో వంట చేసుకొని జీవనం సాగిస్తున్నాడన్నారు. గ్రామంలోని నిర్మాణం మొదలుపెట్టిన ఇల్లు పనులు ఆర్థిక ఇబ్బందులు వలన సక్రమంగా జరగట్లేదని మనస్థాపంతో సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికి చేరాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - యలమంచిలి: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేవిధంగా అధికారులు సహకరించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జరుగుతున్న అవకతవకలను అధికారులు సరిచేయాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు బోదెపు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ వివిధ ప్రభుత్వ శాఖల యొక్క పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ మెంబరు నూకేశ్వరరావు ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని పనిచేసే వారు తక్కువ లబ్ధి పొందే వారు ఎక్కువ చూపించడం జరుగుతుందని అడగడంతో, దీనిపై అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే సుందరపు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొండలరావు, తహశీల్దార్ వరహాలు, వెలుగు ఏపీఎం రాణి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం హరిపురం, అనకాపల్లి జిల్లా వారి ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ వారి సహకారంతో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి వ్యవసాయ అధికారి మోహన్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కాలానికి రైతులకు వరి సాగు గురించి సూచనలు ఇచ్చారు. అలాగే పచ్చి రొట్టె ఎరువుల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారిణి జ్యోష్ణ వరి నాడు మడి యాజమాన్యం గురించి, పచ్చి రొట్టె ఎరువుల వల్ల ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. బి.సి.టి కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మట్టి యొక్క ఆరోగ్య పరిరక్షణ గురించి, సహజ ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. అలాగే పశు వైద్య శాస్త్రవేత్త డా.విజయ రాజ్ఞి పశు గ్రాస సాగు గురించి, వానా కాలంలో పశువుల పరిరక్షణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వాడ్రపల్లి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ చరిత్రను ప్రజలకు అందిస్తాం

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేశ మూలవాసుల చరిత్ర అయిన దళిత సాహిత్యంను పాఠ్యాంశంగా చేర్చాలని ప్రజా వాగ్గేయ కారుడు ఆతవ ఉదయభాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో మంగళవారం దళిత సాహిత్యం 'గడుసు తుమ్మెదలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పోరాట చరిత్రను 2025లో 50 వేల పుస్తకాలను ప్రజలకు ఉచితంగా అందిస్తామని తెలిపారు. కులములు అన్ని కూలిపోయెను. మతములన్ని మాసిపోయిను. జ్ఞానం ఒక్కటే మిగిలిపోవునని అంబేద్కర్ ఆశయ సిద్ధి కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరవ తరగతి నుండి ఎం.ఏ వరకు అంబేద్కర్ చరిత్ర దళిత సాహిత్యాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని కోరారు. దళిత సాహిత్య ముద్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల ప్రతినిధులు కాటపల్లి అప్పారావు, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, పోటేల చంటి, కంకడాల సన్నిబాబు, ఉల్లి శ్రీను, కాటపల్లి శ్రీను, బస్సు తేజ,కాటపల్లి చిన్నారావు, ఉల్లి దేముళ్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఈనెల 15వ తేదీన మండలంలోని కొత్త రేవు పోలవరం సముద్ర తీరం వద్ద జరిగే యోగాంధ్ర జిల్లా స్థాయి కార్యక్రమాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాయకరావుపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి సచిదేవి పరిశీలి ంచారు. మంగళవారం సముద్ర తీరంలోని యోగా నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించి చెత్తా చెదారం లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, వెలుగు ఏపీఎం శివప్రసాద్, సర్పంచ్ మల్లె లోవరాజు, మాజీ సర్పంచ్ కొవిరి బంగారి, టీడీపీ సీనియర్ నాయకులు నల్లపరాజు వెంకట్రాజు, గుర్రం రామకృష్ణ, కోడా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే....

విశాలాంధ్ర - అచ్యుతాపురం: దోమలు నిర్మూలనతో మలేరియా నివారణ సాధ్యమని వైద్యాధికారి కె.శ్రావ్య అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే సాధ్యమని అనే నినాదంతో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు తమ సాయశక్తులా కృషి చేస్తామన్నారు.

దోమలు సంతాన ఉత్పత్తి చేసే ప్రదేశాలను నిర్మూలించి, ఫ్రైడే డ్రైడే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ సన్యాసిరావు, హెచ్ఏ లండా అప్పలకొండ, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం

విశాలాంధ్ర - యలమంచిలి: సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ఆటవీక పాలనను నిరసిస్తూ 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినంలో నిరసనలు తెలపాలని వైసీపీ అనకాపల్లి పార్లమెంటు పార్టీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. నిరసనల అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం యలమంచిలి వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు అధికారం వచ్చాక పూర్తిగా మర్చిపోయి ఆటవిక, అబద్దాల పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. పిల్లలకు అమ్మబడి, మహిళలకు ఉచిత బస్సులు, విద్యా దీవెన, గ్యాస్ బండలు, మెగా డీఎస్సీ అమలు చేస్తానని దగా చేసిందన్నారు. అందుకనే 4వ తేదీన వైసిపి నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటు జనాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కన్నబాబు రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలన్నీ తుంగలోకి తొక్కి, ప్రజల్ని మోసగించిందని, అందుకే ఎన్ని ఫోటో దినాన్ని విజయవంతం చేసి ప్రజల ముందుకు వెళ్లాలని కన్నబాబు రాజు నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, అరేపు గుప్త, సత్యనారాయణ, కొటారు కొండబాబు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.